లాజిస్టిక్ హబ్‌గా మనోహరాబాద్

- పర్కిబండలో 315 ఎకరాల్లో లాజిస్టిక్ హబ్
- మండలంలో ఇప్పటికే 200 పరిశ్రమలు
- భవిష్యత్‌లో మరింత విస్తరించే అవకాశం

7





ఐఐటీ హైదరాబాద్‌లో హాఫ్ మారథాన్

- ప్రారంభించిన ఎస్పీ రూపేష్, మాలావత్ పూర్ణ
- పాల్గొన్న 1500 మంది ఔత్సాహికులు
- సందడిగా మారిన ఐఐటీహెచ్ ప్రాంగణం

7

హాఫ్ మారథాన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ రూపేష్, మాలావత్ పూర్ణ

జాగా కనిపిస్తే పాగా

- ప్రభుత్వ స్థలాలకు రెక్కలు
- ఖాళీగా కనిపిస్తే కబ్జా చేస్తున్న అక్రమార్కులు
- రూ. కోట్లు విలువైన భూములు అన్యాక్రాంతం

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఖాళీ స్థలం కనబడితే చాలు రియల్టర్లు గద్దల్లా వాలిపోతున్నారు. అది ప్రభుత్వ భూమైనా.. పార్కు స్థలమైనా కబ్జాదారులు వదలడం లేదు. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి ఆక్రమణలకు పాల్పడుతున్నారు. విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి.



సంగారెడ్డి ఓడీఎఫ్ కాలనీలో రియల్టర్లు చదును చేసిన పార్కు స్థలం

రూ. 15 కోట్ల విలువైన
పార్కు స్థలం కబ్జాకు యత్నం

సంగారెడ్డి టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డి గ్రేడ్ వన్ మున్సిపాలిటీలో పార్కు స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. 12వ వార్డు పరిధిలోని ఓడీఎఫ్ రెండో వెంచర్ హౌసింగ్ బోర్డు కాలనీలకు సంబంధించిన 1,500 గజాల పార్కు స్థలంపై అక్రమార్కులు కన్నేశారు. ఇరవై సంవత్సరాల క్రితం 385, 387 సర్వే నంబర్లలో ఏర్పాటు చేసిన ఈ వెంచర్లలో 1,500 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. అప్పటి నుంచి ఖాళీ స్థలాన్ని రెండు కాలనీలవాసులు కాపాడుతున్నారు. ఈ స్థలంలో భారీ వృక్షాలు కూడా పెరిగాయి. నాలుగు రోజుల క్రితం కొందరు వ్యక్తులు ఈ స్థలంలో ఉన్న భారీ వృక్షాలను నరికి పొదలను తొలగించి చదును చేస్తున్నారు. ఈ విషయాన్ని గమనించిన ఓడీఎఫ్, హౌసింగ్‌బోర్డు కాలనీల వాసులు వారిని అడ్డుకున్నారు. 65 నంబర్ జాతీయ రహదారి పక్కనే ఉండడంతో ఇక్కడ గజం రూ.లక్షకు పైగా ధర పలుకుతుండడంతో కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని కాలనీవాసులు తెలిపారు.

పట్టించుకోని అధికారులు

అధికారుల నిర్లక్ష్యం వల్లే పార్కు స్థలం కబ్జాకు గురవుతున్నదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. విలువైన ఈ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని తెలిపారు. పట్టణంలో పలు పార్కులను అభివృద్ధి చేసినా ఈ పార్కును పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా పార్కు స్థలం చుట్టూ కంచే ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కబ్జాల చెరలో వక్ఫ్ భూములు

నర్సాపూర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ పట్టణంలో రూ. కోట్లు విలువైన వక్ఫ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. ఫిర్యాదు వచ్చినప్పుడు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడం తప్ప, స్థలాల రక్షణకు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలో పలు సర్వే నంబర్ల పరిధిలో 43.17 ఎకరాల వక్ఫ్ భూములు ఉన్నట్టు గెజిట్‌లో ఉంది. దీంట్లో 15 ఎకరాల వరకు అన్యాక్రాంతమయినట్లు పలువురు మైనార్టీ నాయకులు పేర్కొంటున్నారు. హైవే 765-డి సమీపంలో ఉండటంతో ఈ భూముల విలువ కోట్లలో ఉంటుంది. దీంతో, రోడ్డుకు ఆనుకుని ఉన్న భూములను ఆక్రమించి నిర్మాణాలు చేశారు.



నర్సాపూర్‌లో ఆక్రమణకు గురవుతున్న వక్ఫ్ భూమి

సూచిక బోర్డు మాయం

వక్ఫ్ భూముల రక్షణ కోసం 1998లో వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి హద్దులు నిర్దేశించి బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే ఆ బోర్డులు ప్రస్తుతం కనిపించడం లేదు. 1999లో పలువురు ఆక్రమణదారులకు అప్పటి ఆర్డీవో నోటీసులు జారీచేశారు. ఆ తరువాత భూముల రోణకు ఎటువంటి చర్యలు లేవు. భూములు అన్యాక్రాంతం అయినట్టు నిర్ధారించి నోటీసులిచ్చినా చర్యలు తీసుకోకపోవడంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. కోట్లు విలువైన భూములు రోజురోజుకూ కబ్జాదారుల పాలవుతున్నాయని ముస్లిం నాయకులు కోరుతున్నారు. వక్ఫ్ భూములు కబ్జా చేసినవారిలో రాజకీయ అండదండలున్న పెద్దలు ఉండటంతోనే అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నాయి. ఖాళీగా ఉన్న వక్ఫ్ భూములను గుర్తించి, అధికారులే లీజుకు ఇస్తే వక్ఫ్‌బోర్డుకు, మున్సిపాలిటికీ ఆదాయం వచ్చే అవకాశముందని పేర్కొంటున్నారు. ఇలాగే వదిలేస్తే ఉన్న భూమి కూడా అక్రమార్కుల పాలవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



నర్సాపూర్‌లో విలువైన వక్ఫ్ భూములు అన్యాక్రాంతమవుతున్నా కాపాడేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. భూములను కాపాడాలని వక్ఫ్ బోర్డు రాష్ట్ర కార్యాలయంలో ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. భూములు కాపాడాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం ఉండడం లేదు. ఇక్కడి భూముల వ్యవహారంపై ముఖ్యమంత్రిని కలిసి ఫిర్యాదు చేస్తాం.

-హబీబ్‌ఖాన్, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు

బొమ్మన్‌కుంటలో వివాదాస్పద భూములు



రద్దు చేసిన ఓఆర్‌సీలతో మాయ..
బొమ్మన్‌కుంట పాన్‌మక్తా భూముల్లో పాగా

పటాన్‌చెరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర శివారులో ఔటర్‌రింగ్‌రోడ్డు సుల్తాన్‌పూర్ జంక్షన్‌కు కూతవేటు దూరంలో వివాదాస్పద ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. అమీన్‌పూర్ మండలం సుల్తాన్‌పూర్ మెడికల్ డివైజ్ పార్కుకు దగ్గరలో బొమ్మన్‌కుంట సర్వే నంబర్ 30లో నిజాం కాలం నాటి పాన్‌మక్తా ఇనాం భూములు 722.20 ఎకరాలు విస్తరించి ఉన్నాయి. ముంతఖీబ్ న ంబర్.1332, 1352 ఫస్లీ రికార్డుల ప్రకారం ఎండీ ఫరీదొద్దీన్ పేరు మీద పాన్‌మక్తా భూములుగా వీటిని పేర్కొన్నారు. మొత్తం 722.20ఎకరాలలో 6.08 ఎకరాలలో బొమ్మన్‌కుంట గ్రామం, మరో 6.08 ఎకరాలు రోడ్లు, 17 గుంటల్లో శ్మశానవాటిక, 384 ఎకరాల్లో కొండలు, గుట్టలు, 83.20 ఎకరాల్లోవిస్తరించిన రెండు చెరువులు విస్తరించి ఉన్నట్టు రికార్డుల్లో ఉన్నది. 242.07 ఎకరాల భూమిని గ్రామస్థులు సాగు చేసుకుంటున్నారు. స్వాంతంత్ర్యం వచ్చిన తరువాత 1955లో ఖాస్రా, పహనీల్లో ఇనాందారుల వివరాలు నమోదు కాలేదు. 1983లో అప్పటి సంగారెడ్డి ఆర్డీవో కొందరు ఇనాందారుల వారసుల పేర్ల మీద దొడ్డిదారిన ఓఆర్‌సీలు జారీ చేశారు. ఓఆర్‌సీలు చేజిక్కించుకున్నవారు వందలాది ఎకరాల భూమిని విక్రయించారు. ఈ వ్యవహారంపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో ప్రభుత్వం 1993లో ఎస్ఎన్ మహంతీ అనే ఐఏఎస్ ఆధ్వర్యంలో విచారణ చేయించారు. ఓఆర్‌సీల జారీలో అవకతవకలు వెలుగు చూడటంతో అప్పటి జాయింట్ కలెక్టర్ ఓఆర్‌సీలను రద్దు చేశారు. దీనిపై ఇనాం దారులనుంచి భూములు కొనుగోలు చేసిన వాలనారాయణరావు, రంజనా లోహడే, ఛాయాలోహడే, ఎస్.అనిల్‌కుమార్ మరో తొమ్మిది మంది హైకోర్టులో వేర్వేరుగా రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. అయితే, ప్రభుత్వం రద్దు చేసిన ఓఆర్‌సీలను అడ్డుపెట్టుకుని ఈ భూములను చెరబట్టడానికి ల్యాండ్ మాఫియా తెరవెనక ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు భూములను ప్లాట్లు చేసి విక్రయిస్తున్నా రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం వెనక కొందరు నాయకుల ఒత్తిడులు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఇనాం వివాదంతో గ్రామంలోని పట్టాదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. అవసరానికి అమ్ముకుందామంటే ఎవరూ కొనడం లేదని వాపోతున్నారు. ఈ వివాదంపై అమీన్‌పూర్ తహసీల్దార్ రాధ స్పందిస్తూ బొమ్మన్‌కుంట సర్వే నంబర్ 30లో వివాదాస్పద భూముల్లో చొరబాటుకు ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



ఆక్రమణకు గురైన ప్రభుత్వ పార్కు స్థలం ఇదే..

రూ. 3.50 కోట్ల ప్రభుత్వ భూమికి ఎసరు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో రూ.3.50 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని కబలించి రియల్టర్లు అక్రమ నిర్మాణాలు చేపట్టారు. సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 34వ వార్డు రామచంద్రారెడ్డి కాలనీలో సర్వే నంబర్ 403లో 1991లో అప్పటి ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఎల్‌పీ నంబర్ 18-91-యూ పీహెచ్ఎస్ ప్రభుత్వం లేఅవుట్ చేసి 53 ప్లాట్లను పేద ప్రజలకు కేటాయించింది. మిగిలిన స్థలాన్ని కాలనీ అవసరాలు, పార్కు ఏర్పాటు కోసం వదిలేసింది. ఇదే ఈ భూమి విలువ ప్రస్తుతం రూ.కోట్లలో ఉండడంతో కొందరు అక్రమార్కులు తప్పుడు పత్రాలతో కబ్జాలకు తెరతీశారు. ప్రభుత్వ స్థలం వెయ్యి గజాలకు సంబంధించి నకిలీ ధ్రువపత్రాలను సృష్టించి, ప్లాట్లుగా విభజించి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారని రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం రామచంద్రారెడ్డి కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. స్థానికుల సౌకర్యార్థం, సామాజిక అవసరాలు, పార్కు కోసం ప్రభుత్వం స్థలానికి కేటాయిస్తే కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వాపోతున్నారు.

ఇప్పటి వరకు 2,10,000 మెట్రిక్ టన్నులు

- మెదక్ జిల్లాలో ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు
- మరో 50వేల మెట్రిక్ టన్నులు వస్తాయని అంచనా
- వారం రోజుల్లో పూర్తికానున్న సేకరణ
- ఇప్పటికే 100 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తి

మెదక్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు తుది దశకు చేరాయి. ఈ వానాకాలం సీజన్‌లో మార్కెటింగ్, ఐకేపీ, సంస్థల ఆధ్వర్యంలో 493 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే 100 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ పూర్తికాగా, మరో వారంలో జిల్లావ్యాప్తంగా పూర్తవుతుందని పౌరసరఫరాలశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు ప్రణాళిక రూపొందించగా, ఇప్పటివరకు 2.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. మరో 50 వేల మెట్రిక్ టన్నులు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ధాన్యం సేకరణ తగ్గడానికి కారణం రైతులు నేరుగా దళారులు, మిల్లర్లకు ధాన్యాన్ని విక్రయిస్తుండడమేనని అధికారులు చెబుతున్నారు. వరికోతల సమయంలో వర్షాలకు ధాన్యం తడిసి తేమ శాతం అధికమైంది. వర్షాలకు ధాన్యం ఆరబెట్టుకునేందుకు అవకాశమూ లేకుండాపోయింది. సమయానికి కొనుగోలు కేంద్రాలలో టార్పాలిన్లు సైతం లేకపోవడంతో చాలా ప్రాంతాలలో ధాన్యం తడిసిపోయింది. ఇక తేమశాతం తగ్గదనే కారణాలతో అధికమంది రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. మాయిశ్చర్‌తో పనిలేకండా కల్లాల వద్దే దళారులు ధాన్యాన్ని కొనుగోలు చేయడం, హమాలీచార్జీలు లేకపోవడం, వెంటనే డబ్బులు చెల్లిస్తుండడంతో అన్నదాతలు వ్యాపారులకే ధాన్యం విక్రయిస్తున్నారు. దీంతో, అధికారుల అంచనాల్లో 70 శాతం ధాన్యమే కొనుగోలు కేంద్రాలకు వస్తోంది. మిగతా ధాన్యం సరిహద్దుల్లోని ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర లకు తరలిస్తున్నట్లు సమాచారం.



రైతులకు రూ. 160 కోట్లు బకాయిలు

జిల్లాలో ఇప్పటివరకు 46,232 మంది రైతుల నుంచి 2.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పౌరసరఫరాలశాఖ కొనుగోలు

మిగతా 8వ పేజీలో..

మతోన్మాదులతో హక్కులకు భంగం

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



సమావేశంలో మాట్లాడుతున్న బీవీ రాఘవులు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మతోన్మాదులు, కార్పొరేట్లు రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నాయని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో 'రాజ్యాంగ హక్కుల పరిరక్షణ' అనే అంశంపై ఆదివారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. వైవిధ్యభరితమైన భారతదేశానికి రక్షణగా ఉన్న రాజ్యాంగంలో పేర్కొన్న ఐదు మౌళికాంశాలను నిర్వీర్యం చేసే కుట్రలను అడ్డుకునేందుకు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు మాట్లాడుతూ సంగారెడ్డిలో ఈ నెల 25-28 తేదీల్లో సీపీఎం రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, మల్లికార్జున్, మల్లేశం, రాజయ్య, మాణిక్యం, సాయిలు, రాంచందర్, నర్సింహులు, యాదగిరి, ప్రవీణ్, విద్యాసాగర్, మహిపాల్, నాగేశ్వర్‌రావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ కాలేజీ, ట్రాన్స్ క్లినిక్..

సంగారెడ్డి జీఎంసీలో పారామెడికల్ కోర్సు..

- వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- సంగారెడ్డి మెడికల్ కాలేజీలో ఏర్పాట్లు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పడి ఏడాది పూర్తికావస్తున్న నేపథ్యంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నేడు జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. జోగిపేటకు మంజూరైన ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో తరగతులు నేడు ప్రారంభం కానున్నాయి. దీంతోపాటు

మిగతా 8వ పేజీలో..



సంగారెడ్డి జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ట్రాన్స్ క్లినిక్

ఏడుపాయలలో
దీప కాంతులు

ఏడుపాయలలోని వనదుర్గామాత ఆలయంలో ఆదివారం కార్తీక దీప శోభ వెల్లివిరిసింది. మహిళలు, యువతులు సాయంత్రం వేళ ఆలయంలో అమ్మవారి రూపంలో దీపాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఉదయం నుంచి ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

-పాపన్నపేట, (ఆంధ్రజ్యోతి)



గురుకుల విద్యార్థి అదృశ్యం


సాయిప్రకాష్(ఫైల్)

నారాయణఖేడ్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా ఖేడ్ పట్టణ శివార్లలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఎస్ఐ మొగులయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణఖేడ్ మండలం చందాపూర్‌కు చెందిన సాయిప్రకాష్(13) గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం బిస్కెట్లు తీసుకువస్తానని తోటి విద్యార్థులకు చెప్పి పాఠశాల నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించక పోవడంతో గురుకుల ప్రత్యేక అధికారిణి బాలమణి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పటాన్‌చెరులో ఫార్మాసిటీ బాధితులు


- నాలుగు గ్రామాల నుంచి 120 మంది రాక
- పారిశ్రామిక వాడల్లో పర్యటన
- పరిశ్రమలతో కలుగుతున్న దుష్పరిణామాలపై ఆరా
- ఫార్మాసిటీ రద్దు చేసేదాకా పోరాడుతామని స్పష్టం


కాజుపల్లి గ్రామంలో పర్యటిస్తున్న ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు, రైతులు

యాచారం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలలో ఏర్పాటు చేయనున్న విషపూరితమైన ఫార్మాసిటీని రద్దు చేసేదాక తాము శాంతియుతంగా పోరాడుతామని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు, రైతులు ప్రకటించారు. గత ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం పేదల భూములు తీసుకున్నదన్నారు. అధికారంలోకి వస్తే ఫార్మాసిటీ రద్దు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నయవంచన చేసిందని మండిపడ్డారు. ఆదివారం ఆయా గ్రామాలకు చెందిన 120 మందితో కూడిన బృందం రెండు బస్సులలో పటాన్‌చెరువు పారిశ్రామిక ప్రాంతాలు, సంగారెడ్డి జిల్లా కిష్టయపల్లి, కాజుపల్లి, గడ్డపోతారం, పాషామైలారం తదితర గ్రామాల్లో పర్యటించింది. ఆయా గ్రామాల రైతులను కలిసి పరిశ్రమల కలుగుతున్న దుష్పరిణామాలపై ఆరా తీశారు. ఈనే దశలో ఉన్న పాడి గేదెలు, ఆవులు మృత్యువాత పడుతున్నాయని అక్కడి రైతులు తమ గోడును వెల్లబోసుకున్నారు. ఇక్కడ 55 ఏళ్లకు మించి మనుషులు బతకడం గగనమేనని, గర్భిణులకు తరచూ గర్భస్రావమవుతుందని నని చెప్పి కన్నీటి పర్యంతమైనట్లు వారు పేర్కొన్నారు. వ్యర్థ రసాయనాలతో చెరువులు, కుంటలు నిండి భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని కాజుపల్లి, గడ్డపోతారం పాషామైలారం గ్రామాల రైతులు తెలిపినట్లు చెప్పారు. పాడిపశువులకు ఆర్వో వాటర్ ఇస్తున్నట్లు చెప్పారన్నారు. తమ ప్రాణం పోయినా మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలలో విషపూరితమైన ఫార్మాకంపెనీలు ఏర్పాటు చేయనివ్వబోమని ఫార్మాసిటి వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ కవుల సరస్వతి, సభ్యులు మహిపాల్‌రెడ్డి, బర్ల మల్లేష్ తదితరులు తెలిపారు. ఫార్మాసిటీ రద్దుకు విపక్షాలు తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. త్వరలో ఉద్యమం లేవదీస్తామని చెప్పారు.

సీబీఐ ఆఫీసర్‌ను మాట్లాడుతున్నా..

- నర్సాపూర్‌లో పులువురికి సైబర్ నేరగాళ్ల కాల్స్



సీబీఐ అధికారినంటూ ఓ వ్యక్తికి వచ్చిన వాట్సాప్ కాల్

నర్సాపూర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నేను సీబీఐ ఆఫీసర్‌ను మాట్లాడుతున్నా.. అంటూ మెదక్ జిల్లాలోని నర్సాపూర్‌లో పలువురికి వారం రోజులుగా వాట్సాప్ కాల్స్ వస్తున్నాయి. కాల్ చేసి తాము సీబీఐ అధికారులమంటూ బెదిరింపులకు దిగుతుండటంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. వారం రోజులలో నలుగురికి పైగా కాల్స్ వచ్చాయి. అవతలివాళ్లు హిందీలో మాట్లాడుతూ తాము సీబీఐ అధికారులమని, మీ కొడుకుపై కేసు నమోదైందని, అరెస్టు చేస్తామంటూ బెదిరించినట్లు బాధితులు వాపోయారు. సదరు నంబర్ వాట్సాప్ డీపీని పరిశీలిస్తే పోలీసు డ్రెస్సులో ఉన్న వ్యక్తి ఫొటో కనిపించడంతో నిజమేనని అనుకుని భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆదివారం కూడా ఓ మహిళకు ఫోన్ చేసి నీ కొడుకును అరెస్టు చేస్తామంటూ చెప్పడంతో ఆమె భయపడి ఇరుగు పొరుగువారికి చెప్పింది. ఇదంతా డబ్బులు కొట్టేసేందుకు సైబర్ నేరగాళ్ల ఎత్తుగడ అని, ఆందోళన చెందవద్దని తెలిపారు. మరోసారి ఇలాంటి కాల్ వస్తే ఎత్తకూడదని ధైర్యం చెప్పారు. ఎవరైనా కాల్స్ చేసి బెదిరింపులకు పాల్పడితే ఏ మాత్రం భయపడకుండా పోలీసుల దృష్టికి తీసుకురావాలని స్థానిక సీఐ జాన్‌రెడ్డి సూచించారు. నకిలీ కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

అప్పులు తీర్చలేక గిరిజన రైతు ఆత్మహత్య


మోతిలాల్ (ఫైల్)

శివ్వంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అప్పులు తీర్చలేక గిరిజన రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తాళ్లపల్లితండాకు చెందిన రైతు ధనావత్ మోతిలాల్ (35) మద్యానికి బానిసై పెద్ద ఎత్తున అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో ఆదివారం ఉదయం 6 గంటలకు పొలం దగ్గరకు వెళ్లి గడ్డి మందు తాగడంతో కిందపడి విలవిలలాడుతున్నాడు. అంతలోనే అక్కడికి వెళ్లిన భార్య అనిత ఏమైందని మోతిలాల్‌ను అడగ్గా గడ్డి మందు తాగానని తెలిపాడు. వెంటనే నర్సాపూర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థి ప్రతిభ

- రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టు


ప్రాజెక్టుతో విద్యార్థి రేవంత్

మెదక్ అర్బన్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో శివ్వాయిపల్లి ఎంపీయూపీఎస్‌కు చెందిన ఏడో తరగతి విద్యార్థి రేవంత్ ప్రతిభ కనబరిచాడు. అతడు రూపొందించిన నాచురల్ ఫామింగ్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. సహజ వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు, ఆహార రుచిని మెరుగుపర్చడంతోపాటు నేలను మృదువుగా చేస్తోందని, సాగు ఖర్చులు కూడా 60 నుంచి 70 శాతం తగ్గుతాయని, ఫలితంగా రైతుల నికర ఆదాయం పెరుగుతోందని ప్రాజెక్టు ప్రయోజనాలు రేవంత్ వివరించారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంపై రేవంత్‌తోపాటు గైడ్ టీచర్ సునీతను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

కరాటే పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు



మెదక్ అర్బన్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆదివారం స్థానిక గుల్షన్ క్లబ్‌లో రెంజుకీ షోటోకాన్ కరాటే క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి వివిధ విభాగాల్లో బెల్టులు సాధించినట్లు కరాటే మాస్టర్ నగేష్ తెలిపారు.

గాగిల్లాపూర్‌లో కొండచిలువల భయం


గ్రామస్థుల చేతిలో హతమైన కొండ చిలువ

బెజ్జంకి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాగిల్లాపూర్‌లో వారం రోజుల నుంచి కొండ చిలువలు సంచరిస్తూ గ్రామస్థులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తాజాగా ఆదివారం మరో కొండ చిలువ గ్రామంలోని నివాస సముదాయాల మధ్య సంచరిస్తూ ప్రజలకు కనిపించడంతో తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మహిళల కేకలతో అక్కడికి చేరుకున్న గ్రామస్థులు కొండ చిలువపై కర్రలతో దాడి చేసి హతమార్చారు. వరుసగా వారం రోజుల్లో నాలుగు కొండ చిలువలు గ్రామంలో సంచరించడంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫారెస్ట్ అధికారులు గ్రామంలో పర్యటించి కొండ చిలువల ఆచూకీని తెలుసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట శివారులోని మిలాన్ గార్డెన్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తి(25-30 ఏళ్లు) గాయాలతో పడి ఉన్నాడు. గమనించిన పొన్నాల గ్రామానికి చెందిన సాయిచరణ్ 108కి సమాచారం ఇవ్వడంతో అతడిని సిద్దిపేట ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతిచెందినట్లు వైద్య సిబ్బంది పోలీసులకు తెలిపారు. మృతుడి ఎడమ ఛాతిపైన అంజలి అని పచ్చబొట్టుతో పేరు ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

సిద్దిపేట అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భార్యతో కోర్టులో విడాకులు మంజూరు కావడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిద్దిపేట పట్టణం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పొడిశెట్టి సంజీవ్(35) పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గతనెల 29న తన తల్లి పొడిశెట్టి ఎల్లవ్వను సిద్దిపేట రైతుబజార్ వద్ద దింపి మళ్లీ వస్తానని చెప్పి అప్పటి నుంచి కనిపించకుండాపోయాడు. దీంతో సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా సిద్దిపేట అర్బన్ మండలం కిష్టసాగర్ గ్రామ శివారులో ఒడిసెలకుంట వద్ద లభించిన మృతదేహం సంజీవ్‌దిగా గుర్తించి పోలీసులు కేసు నమోదు చేశారు. నెల రోజుల క్రితం భార్యతో కోర్టులో విడాకులు మంజూరుకావడంతో అప్పటినుంచి మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా, ఒకరికి తీవ్రగాయాలు



రోడ్డుపై ఎగిరిపడ్డ కారు ఇంజన్

కొండపాక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కారు అదుపు బోల్తాపడిన ఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. దుబ్బాక మండలం కమ్మర్లపల్లి గ్రామానికి చెందిన రవి కారులో హైదరాబాద్ వైపు వెళ్తున్నాడు. కొండపాక మండలం దుద్దెడ శివారులోని కలెక్టరేట్ సమీపంలో రాజీవ్ రహదారిపై అదుపుతప్పి డివైడర్ల మధ్యలో ఉన్న విద్యుత్‌స్తంభానికి ఢీకొట్టి, అవతలివైపు బోల్తాపడి రోడ్డు పక్కన ఉన్న చెట్లవైపు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రవి కాలు విరిగింది. కారు ఇంజన్ తుక్కుతుక్కయి ఎగిరి రోడ్డుపై పడింది. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు.

ఐఐటీ హైదరాబాద్‌లో హాఫ్ మారథాన్



మెడల్స్ చూపుతున్న మారథాన్ విజేతలు

- ప్రారంభించిన ఎస్పీ రూపేష్, మాలావత్ పూర్ణ
- పాల్గొన్న 1500 మంది ఔత్సాహికులు
- సందడిగా మారిన ఐఐటీహెచ్ ప్రాంగణం



ఐఐటీహెచ్ ప్రాంగణంలో హాఫ్ మారథాన్‌లో పరుగులు తీస్తున్న యువకులు

కంది, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ రన్నర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో ఆదివారం హాఫ్ మారథాన్ నిర్వహించారు. ఉదయం 5 గంటలకు ఐఐటీహెచ్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 21కే, 10కే, 5కే ఫన్‌రన్‌ల పేరిట 21 కిలోమీటర్లు, 10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్ల పరుగు పందాల్లో పాల్గొనడానికి 1,00 ఔత్సాహికులు ఆసక్తి కనబర్చారు. వీరంతా గత నెల రోజులుగా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి మారథాన్‌లో పాల్గొనడానికి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. అయితే ఈ మారథాన్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు, యువకులు, వృద్ధులు, ఐఐటీహెచ్ అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసులు వయస్సు సంబంధం లేకుండా రన్నింగ్, జాగింగ్‌లు చేశారు. ఇందులో ప్రత్యేక ఆకర్షణగా ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన పూర్ణ మాలావత్ అందరితో కలిసి పరుగులు తీస్తూ సందడి చేశారు. దీంతో ఐఐటీహెచ్ ప్రాంగణమంతా సందడి నెలకొన్నది. ఐఐటీహెచ్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి మెయిన్ గేటు వరకు రన్నర్స్‌కు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకునేందుకు 10 మీటర్లకు ఒకరు చొప్పున ఐఐటీహెచ్ విద్యార్థులను వాలంటీర్లుగా నియమించారు. ప్రతీ సర్కిల్ వద్ద వాటర్ పాయింట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్స్, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచారు. ఉదయం 5 గంటలకు ప్రారంభమైన ఈ మారథాన్ 11 గంటలకు వరకూ కొనసాగింది. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రతిఒక్కరూ ఐఐటీహెచ్‌లోని నూతన భవన సముదాయాలను, అక్కడి ప్రకృతి పచ్చదనాన్ని చూసి మంత్రముగ్ధులయ్యారు. 21కే, 10కే, 5కే రన్‌ల పోటీల్లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు ఐఐటీహెచ్ అధికారులు బహుమతులను అందజేశారు. మారథాన్‌లో పాల్గొన్న ప్రతిఒక్కరికీ మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఐఐటీహెచ్‌లో చదువుతో పాటు శారీరక దృఢత్వం పెంపొందించుకునేందుకు ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో చైతన్యం తీసుకొస్తాయన్నారు. స్థితిస్థాపక సమాజ స్ఫూర్తిని నింపేందుకు ఈ ఈవెంట్ ఒక మైలురాయి అన్నారు. ఈ కార్యక్రమం ప్రజలందరితో సహకారం, స్నేహభావంతో పాటు జీవనశైలిని ప్రేరేపించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి ఆకాంక్షించారు.

శారీరక శ్రమతోనే ఆరోగ్యం



ఉదయాన్నే లేవగానే ప్రతీరోజు క్రమం తప్పకుండా జాగింగ్ చేస్తాను. ఉదయం 5 గంటల నుంచే నా దినచర్య మొదలవుతుంది. ఈ రోజు ఐఐటీహెచ్ మారథాన్‌లో నేను కూడా భాగస్వామినయినందుకు ఆనందంగా ఉన్నది. ప్రతీ ఒక్కరు తమ దైనందిక జీవితంతో వ్యాయామాన్ని అలవాటు చేసుకుంటే ఎంతో చురుకుగా ఉంటారు. శారీరక శ్రమతోనే ఆరోగ్యం లభిస్తుంది.

- ఆనందరావు, నల్లగండ్ల, హైదరాబాద్

రన్నింగ్ చేస్తే ఒత్తిడి మాయం



ప్రతీరోజు రన్నింగ్ చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు ఒత్తిడి మాయం అవుతుంది. నేను ప్రతిరోజు గంటసేపు రన్నింగ్ చేస్తాను. అదే నున్న ఈ రోజు ఐఐటీహెచ్‌లో 21కే రన్‌లో పాల్గొనేందుకు తోడ్పడింది. ఎలాంటి అలుపు లేకుండా నేను గంటకుపైగా పరుగెత్తగలను. రన్నింగ్ చేయలేకపోయినా కనీసం వాకింగ్ అయినా చేయడం ఆరోగ్యానికి ఎంతో మంచిది.

- సుగుణ, హైటెక్‌సిటీ, హైదరాబాద్


పరుగుతో ఆరోగ్యం మెరుగు పడుతుంది



రోజు 30 నిమిషాలు పరుగులు తీస్తే ఆరోగ్యం మెరగవుతుంది. శరీరంలో రోగనిరోధక శక్తి పెంచడానికి రన్నింగ్ దోహదపడుతుంది. ఐఐటీ హైదరాబాద్‌లో ఈ హఫ్ మారథాన్ కాంపిటీషన్‌లో పాల్గొనడానికి నేను మా స్నేహితులతో కలిసి బెంగుళూరు నుంచి వచ్చాను. ఇక్కడ 21కే రన్నింగ్ చేయడం మరిచిపోలేని అనుభూతిని ఇచ్చింది. రోజు రన్నింగ్ చేయడం నా హబీగా మలుచుకున్నాను.

- గాయత్రి, బెంగుళూరు

ఒలింపిక్స్‌లో మెడల్ సాధిస్తా



ఐఐటీహెచ్ ఉన్న డీపీవీ స్కూల్‌లో నేను ఫోర్త్ క్లాస్ చదువుతున్నాను. మా పేరెంట్స్ ప్రోత్సాహంతో నేను ఈ మారథాన్ 5కే రన్‌లో పాల్గొన్నాను. ఈ పోటీ నాకు ఎంతగానో నచ్చింది. ఉదయాన్నే పెద్దవాళ్లతో కలిసి పరుగులు తీయడం నాలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. నేను పెద్దయ్యాక మన ఒలింపిక్స్‌లో పాల్గొని మన దేశానికి మెడల్స్ తీసుకొస్తా.

- ప్రణీత్, డీపీవీ స్కూల్, ఐఐటీహెచ్





వంటల పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా సివిల్ సప్లయ్ ఆఫీసర్ తనూజ, ఐవోసీఎల్ చీఫ్ మేనేజర్ సరోజిని, కుకింగ్ కాంపిటీషన్‌లో పాల్గొన్న మహిళలు

మన వంటగది.. మన బాధ్యత

- సందడిగా సాగిన ఐవోసీఎల్ కుకింగ్ కాంపిటీషన్
- ఓవైపు అవగాహన కార్యక్రమాలు.. మరోవైపు వంటల ఘుమఘుమలు
- సెన్స్ ఆఫ్ డ్యూటీ క్యాంపెయిన్‌లో మహిళలకు అవగాహన

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఒకవైపు వంటగదిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గ్యాస్ వాడుతున్నప్పుడు పాటించాల్సిన సేఫ్టీ టిప్స్ పట్ల అవగాహన కల్పిస్తూనే.. మరోవైపు మహిళా వినియోగదారుల వంటల ఘుమఘుమలతో ఐవోసీఎల్ కుకింగ్ కాంపిటీషన్ సందడిగా సాగింది. సిద్దిపేట పట్టణంలోని కొండా భూదేవి ఫంక్షన్‌హాల్లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) ఆధ్వర్యంలో సెన్స్ ఆఫ్ డ్యూటీ క్యాంపెయిన్‌లో భాగంగా ఆదివారం మహిళలకు కుకింగ్ కాంపిటీషన్ ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా సివిల్ సప్లయ్ ఆఫీసర్ తనూజ, సికింద్రాబాద్ ఐవోసీఎల్ చీఫ్ మేనేజర్ సరోజినితో కలిసి కాంపిటీషన్‌ను ప్రారంభించారు. వివిధ మండలాల నుంచి ఎంపికచేసిన 20 మంది మహిళలు వంటల పోటీల్లో పాల్గొన్నారు. విజేతలను ఎంపికచేసి బహుమతులను అందజేశారు. అంతకుముందు ఏర్పాటుచేసిన సమావేశంలో గ్యాస్ వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఐవోసీఎల్ చీఫ్ మేనేజర్ సరోజని మహిళలకు వివరించారు. ఐవోసీఎల్ డీలర్లు వామనరావు, పల్లకొండ వెంకటేశ్వర్లు, నీలం రవీందర్, సోమయ్య మాట్లాడుతూ వినియోగదారులు గ్యాస్ వాడుతున్నప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా సమస్య వస్తే 1906 నెంబర్‌కు కాల్ చేయాలని చెప్పారు.

గ్రామాల్లో అవగాహన కల్పించాలి



ఇలాంటి అవగాహన కార్యక్రమాలు గ్రామాల్లో విస్తృతంగా చేపట్టాలి. చాలామందికి గ్యాస్ వాడకం తెలియక ఇబ్బందులు పడుతుంటారు. చాలాఏళ్లుగా సురక్ష పైపులు మార్చకుండా అలాగే వంటలు చేస్తుంటారు. వాళ్లకు అవగాహన కల్పించాలి. ఈ కార్యక్రమం ద్వారా తెలియని విషయాలు తెలుసుకోవటంతో పాటుగా జాగ్రత్తలపై అవగాహన వచ్చింది.

- చిలుక స్వర్ణలత, గజ్వేల్, విన్నర్

సంగారెడ్డిలో హెచ్‌పీ గ్యాస్ ఆధ్వర్యంలో..



అవగాహన కల్పిస్తున్న హెచ్‌పీ గ్యాస్ సేల్స్ ఆఫీసర్ శివకృష్ణ

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని చక్ర వెంచర్‌లో హెచ్‌పీ గ్యాస్ ఆధ్వర్యంలో 'మన వంట గది-మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా ఫుడ్ కాంపిటీషన్ ఆదివారం నిర్వహించారు. హెచ్‌పీ గ్యాస్ సేల్స్ ఆఫీసర్ శివకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మహిళలు వంట వండేటప్పుడు గ్యాస్ కంపెనీల ద్వారా సేఫ్టీపై అవగాహన కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా ఫుడ్ కాంపిటీషన్ నిర్వహించగా 50 మంది మహిళలు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీ గ్యాస్ డీలర్ జిన్నా మురళీధర్‌రెడ్డి, బీపీసీ, ఐవోసీ డీలర్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని మహిళ దారుణ హత్య

- ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన దుండగులు
- మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు, క్లూస్ టీం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీం, పోలీసులు

హత్నూర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని మహిళను హత్యచేసి ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు దుండగులు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలోని నస్తీపూర్ గ్రామ శివారులో వెలుగుచూసింది. వ్యవసాయ పొలాల్లోకి వెళ్లే రైతులు ఆదివారం ఉదయం మహిళ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. జిన్నారం సీఐ నయీమొద్దీన్, ఎస్ఐ సుభాష్ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలు 25 నుంచి 35 ఏళ్ల వయసు కలిగి ఉండగా, రెండు కాళ్లకు వెండి కడియాలు, చెవులకు మాటీలు, ఒంటిపై ఆకుపచ్చ చీర ఆనవాళ్లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ ద్వారా వివరాలు సేకరించారు. మహిళను ఎక్కడో హత్య చేసి తీసుకొచ్చి ఇక్కడ తగులు పెట్టినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే సీఐ జిన్నారం 8712656730, హత్నూర ఎస్ఐ 8712656752 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

కేతకీ ఆలయంలో భక్తుల సందడి

ఝరాసంగం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం చివరి ఆదివారం అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివరావడంతో ఆలయం సందడిగా మారింది. ఆలయ ఆవరణలో నవగ్రహాలకు తైలం, నువ్వులు, నల్ల వస్త్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు చేశారు. అదేవిధంగా మండల పరిధి మాచునూర్ గ్రామ శివారులోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అభిషేకాలు చేశారు. కాగా కేతకీ ఆలయంలో సంగారెడ్డి అదనపు ఎస్పీ సంజీవరావు కుటుంబసమేతంగా పూజలు చేశారు.

లలితా పరమేశ్వరి ఆలయంలో సహస్ర చండీహోమం



తూప్రాన్ లలితాపరమేశ్వరీ ఆలయంలో లక్ష దీపోత్సవం

తూప్రాన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి వెంకటాపూర్ (పీటీ) శివారులోని లలితాపరమేశ్వరీ ఆలయంలో ఆదివారం 1,089వ చండీహోమం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు, దేవీ ఉపాసకులు సోమయాజుల రవీంద్రశర్మ ఆధ్వర్యంలో సహస్ర లింగార్చన, లక్ష బిల్వార్చన, లక్ష దీపోత్సవం, 1,089వ చండీయాగం నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో జన్మించిన చిన్నారులకు తులాభారం, 2025 క్యాలెండర్ ఆవిష్కరణ చేపట్టారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మెదక్ చర్చిలో ఘనంగా క్యారెల్స్ సండే



క్యారెల్స్ కార్యక్రమానికి హాజరైన భక్తులు

మెదక్ కల్చరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐలో ఘనంగా క్యారెల్స్ సండే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిటైర్డ్ ప్రెసిబెటర్ అలెగ్జాండర్ జాన్ భక్తులకు దైవ ప్రవచనాలు వినిపిస్తూ పవిత్రమైన మనసుతో దేవుడిని ఆరాధిస్తే దేవుడు తప్పకుండా మనల్ని ఆదరిస్తాడన్నారు. దైవదూతల కాలం నుంచి క్యారెల్స్ పాడడం ఆచరణలో ఉందన్నారు. అనంతరం భక్తులు ఆలపించిన గీతాలు, చిన్నారుల ఆటలు అందరినీ అలరించాయి.

లాజిస్టిక్ హబ్‌గా మనోహరాబాద్



కొండాపూర్‌లో టీజీఐఐసీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలు

- పర్కిబండలో 315 ఎకరాల్లో లాజిస్టిక్ పరిశ్రమ
- ఇప్పటికే 200లకు పైగా పరిశ్రమలు
- భవిష్యత్‌లో జాతీయస్థాయికి..



పర్కిబండ శివారులో 72 ఎకరాల్లో లాజిస్టిక్ పార్కు కోసం టీజీఐఐసీకి అప్పగించిన స్థలం

మనోహరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలోని మనోహరాబాద్ మండలం ఇక లాజిస్టిక్ హబ్‌గా మారబోతోంది. ఇప్పటికే మండల కేంద్రంలో 200లకు పైగా చిన్న, భారీ మధ్య తరహా పరిశ్రమలు ఉన్నాయి. కొత్తగా మండల పరిధిలోని పర్కిబండ శివారులో సుమారు 315 ఎకరాలకు పైగా భూ సేకరణ చేసి అక్కడ మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కును కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి నిర్మించనున్నది. ఇది అందుబాటులోకి వస్తే మెదక్ జిల్లాలో మనోహరాబాద్ మండలం పరిశ్రమలకు అడ్డాగా మారుతుంది. లాజిస్టిక్ పార్కు ఏర్పాటుకు పర్కిబండ శివారు ప్రాంతం అనువుగా ఉన్నదని గుర్తించి రాష్ట్రమంత్రి మండలి తాజాగా ఆమోదం తెలిపింది. ఈ మేరకు రెవెన్యూ సిబ్బంది 72 ఎకరాల భూమిని గుర్తించారు. దీని దస్త్రాలు సిద్ధం చేసి టీజీఐఐసీ(తెలంగాణ స్టేట్ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) అధికారులకు అప్పగించి కసరత్తు మొదలుపెట్టారు. ఇక్కడ లాజిస్టిక్ పార్కు ఏర్పాటైతే సుమారు 3 వేలకుపైగా మందికి ఉపాధి లభిస్తుంది. మెదక్ జిల్లాలో రీజినల్ రింగ్‌రోడ్డు, రైల్వే లైన్, మనోహరాబాద్ మండలం మీదుగా 44వ జాతీయ రహదారి, అటు నర్సాపూర్ నియోజకవర్గం మీదుగా 765-డి జాతీయ రహదారి ఉండడంతో లాజిస్టిక్ పార్కు ఏర్పాటుకు ఈ ప్రాంతం అనుకూలమైనదిగా గుర్తించారు.

రాజ్యసభలో ఆమోదం

నాలుగురోజుల క్రితం మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు ఏర్పాటుకు మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పర్కిబండలో 315 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని కేంద్రం వెల్లడించింది. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కూమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర రవాణా జాతీయ రహదారుల మంత్రి నితిన్‌గడ్కరీ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. సాధ్యాసాధ్యాల అధ్యయనంలో నివేదికను రూపొందిస్తున్నట్లు చెప్పారు.

డ్రై పోర్టు

లాజిస్టిక్ పార్కులో డ్రై పోర్టు నిర్మించడంతో ఇక్కడి నుంచి నేరుగా జాతీయస్థాయి, రైలు, విమాన, సముద్రమార్గాల ద్వారా వస్తువులు ఎగుమతి చేసుకోవడం జరుగుతుంది. డ్రైపోర్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. అలాగే లాజిస్టిక్ పార్కు కోసం మనోహరాబాద్ 44 జాతీయ రహదారి, లేదా తూప్రాన్ నుంచి నర్సాపూర్ వెళ్లే దారిగుండా తక్కువ దూరం వచ్చేటట్లు 150 మీటర్ల వెడల్పులతో రోడ్డు ఏర్పాటు చేయాలని అధికారులు పరిశీలిస్తున్నారు.

పరిహారం అందజేత

పరిశ్రమల ఏర్పాటుకు గత ప్రభుత్వం ఈ ప్రాంతంలో సుమారు 72 ఎకరాల గ్యాప్‌లైన్ భూమిని, 6.5 ఎకరాల పట్టా భూమిని, 234 ఎకరాల ప్రభుత్వ, ఎఫ్‌టీఎల్ భూములు సుమారు 315 ఎకరాలు సేకరించారు. రైతులకు ఎకరాకు రూ.19 లక్షలు, ఇతర పంటల దిగుబడిని బట్టి రూ.9.5 లక్షల నుంచి రూ.14 లక్షల చొప్పున మొత్తం రూ.42 కోట్ల వరకు పరిహారం అందజేశారు. తాజాగా కేంద్రం ఆమోదం తెలపడంతో పర్కిబండ శివారులోని 611, 209 సర్వే నెంబరు మధ్యలో 72 ఎకరాల్లో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి.

జాతీయస్థాయిలో ఎగుమతులు



మా గ్రామంలో లాజిస్టిక్ పార్కు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. పరిశ్రమల్లో మండలంలోని ఆయా గ్రామాల నిరుద్యోగులు, పర్కిబండలో భూములు కోల్పోయిన వారికి అవకాశం కల్పించాలి. భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలను ఆదుకోవాలి.

- శ్రీలతాఆనంద్, మాజీ ఎంపీటీసీ

భూసేకరణ పూర్తిచేశాం



మనోహరాబాద్ మండలం పర్కిబండ శివారులో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కు నిర్మాణానికి భూసేకరణ పూర్తిచేశాం. మెదక్ జిల్లాలో రీజినల్ రింగురోడ్డు, రైల్వే లైన్లు, మనోహరాబాద్‌లో 44వ జాతీయ రహదారి, కాశ్మీర్ టు కన్యాకుమారి వరకు కలదు. అటు నర్సాపూర్‌లో 765-డీ జాతీయ రోడ్డు ఉండటంతో రానున్నకాలంలో ఎక్కువ పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వం మొగ్గు చూపుతుంది.

- చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్, మనోహరాబాద్

నేడు బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్లు పర్యటన

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నేడు బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్లు ఈనెల 2న సంగారెడ్డిలో పర్యటించనున్నట్టు కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డిలోని జడ్పీ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ అమలుపై ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారని, జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ కుల సంఘాల నాయకులు స్వచ్ఛంద సంస్థల సభ్యులు కమిషన్‌కు వినతులు,ఫిర్యాదులు సమర్పించాలని కోరారు.

నేటి నుంచి కుష్ఠు రోగుల గుర్తింపు సర్వే

మెదక్ కల్చరల్, డిసెంబరు 1: తెలంగాణ ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 2నుంచి 15వ తేదీ వరకు కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వే నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్యాధికారి దినసరి శ్రీరాం అన్నారు. సర్వేలో భాగంగా ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరీక్షిస్తారన్నారు.

4న హిందూ సంఘాల నిరసన

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఈ నెల 4న హిందూ సంఘాల ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నాయకులు కందాడై వరదాచార్యులు, దత్తాత్రేయచౌహాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మండల ప్రజాపరిషత్ ఏర్పాటుతో..

మారనున్న రాజకీయ సమీకరణాలు



చౌటకూర్ తహసీల్దారు కార్యాలయం

- 'చౌటకూర్'లో నాయకత్వ లేమి?
- కొత్త తరం ఎదిగేందుకు అవకాశాలు
- మరో 3 లేదా 4 ఎంపీటీసీ స్థానాలు పెరిగే అవకాశం
- జనాభా ప్రాతిపదికన అధికారుల కసరత్తు

పుల్‌కల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్‌ను నూతన మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ)గా ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21న ఉత్తర్వులు జారీ చేయడంతో మండలంలో రాజకీయ సమీకరణలు మారనున్నాయి. ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని 34 గ్రామ పంచాయతీలకు 15 గ్రామ పంచాయతీలను వేరు చేస్తూ 2020లో చౌటకూర్ కేంద్రంగా రెవెన్యూ మండలం ఏర్పాటైంది. ఉమ్మడి పుల్కల్ మండలం జడ్పీటీసీ సభ్యురాలిగా విజయం సాధించి జడ్పీ చైర్ పర్సన్‌గా ప్రాతినిధ్యం వహించిన అందోలు మండలం డాకూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ అందోలు అసెంబ్లీ నియోజకవర్గం అగ్రనేత పట్లోళ్ల జైపాల్‌రెడ్డి సతీమణి మంజుశ్రీ చివరి జడ్పీటీసీ సభ్యురాలిగా నిలిచిపోనున్నారు. ఇక ఎంపీపీ అధ్యక్షురాలిగా ముదిమాణిక్యం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పట్లోళ్ల నరసింహారెడ్డి కోడలు చైతన్యరెడ్డి ఉమ్మడి మండలానికి చివరి ఎంపీపీ అధ్యక్షురాలిగా నిలువనున్నారు.

మండలంలో ప్రభావం చూపే నాయకులేరీ?

చౌటకూర్ మండలంలో అధికార కాంగ్రెస్‌తో సహా, ప్రధాన ప్రతిపక్షాలలో మండల స్థాయిలో ప్రభావం చూపగలిగిన నాయకులు అంతంతమాత్రమే. మండల కేంద్రమైన చౌటకూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ, సీడీసీ మాజీ చైర్మన్ భూంరెడ్డి సుభాష్‌రెడ్డి ప్రాబల్యం ఒకప్పుడు బాగానే ఉండేది. ప్రస్తుతం ఆయన అధికార కాంగ్రెస్‌పార్టీలో కొనసాగుతున్నప్పటికీ క్రియాశీలకంగా వ్యవహరించడం లేదు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఉన్న శివంపేట గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ నత్తి దశరథ్ క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. పార్టీ అధికారంలో ఉండటంతో మండలంలో పార్టీని, ప్రభుత్వ కార్యక్రమాలను ముందుండి నడిపిస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలలో మండలస్థాయిలో ప్రభావం చూపగల నాయకుల సంఖ్య అంతంతమాత్రమే. మొత్తంగా పరిశీలిస్తే అన్నీ పార్టీల్లో నాయకత్వం బలపడాల్సి ఉన్నది.

స్థానాలు పెరిగే అవకాశం..

ఈ మండలంలో కొత్తగా గ్రామ పంచాయతీలు పెరిగేందుకు ఏ మాత్రం అవకాశం లేదు. ప్రస్తుతం చౌటకూర్, కోర్పోలు, సుల్తాన్‌పూర్, చక్రియాల, శివంపేట, వెంకటకిష్టాపూర్‌ల పేరుతో మండల ప్రాదేశిక నియోజకవర్గం(ఎంపీటీసీ)లు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 6 మండల ప్రాదేశిక నియోజకవర్గాలుండగా, మరో 3 లేదా 4 స్థానాలు పెంచితే ఎంపీటీసీ సభ్యుల సంఖ్యా బలం పదికి చేరుకుంటుంది. ఆయా పంచాయతీలలోని జనాభా, ఓటర్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని కొత్తగా ఎంపీటీసీ స్థానాల సంఖ్యను పెంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

తెరమీదకు కొత్త తరం..

చౌటకూర్ మండలం కొత్తగా ఏర్పాటు కావడంతో కొత్త తరం నాయకత్వం తెరమీదకు రానున్నది. ఈ మండలానికి జడ్పీటీసీ, ఎంపీపీ అధ్యక్ష పదవులకు నాయకత్వం వహించేందుకు ఆయా పార్టీల్లోని నాయకులు ఉవ్విళ్లూరుతున్నారు. బహునాయకత్వం కింద ఉమ్మడి పుల్కల్ మండలంలో ఇంతకాలం జడ్పీటీసీ, ఎంపీటీసీ పదవులకు పోటీ చేసేందుకు అవకాశం రాని నాయకులకు ఇది సువర్ణకాశంగా భావించవచ్చు. ప్రస్తుతం కొత్త మండల ప్రజా పరిషత్ ఏర్పాటుతో పోటీ చేసేందుకు యువకులు ఆసక్తి కనబరుస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో గ్రామ పంచాయతీలకు, తదనంతరం జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ఇందులో భాగంగానే ఆయా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు కొత్త మండల ప్రజా పరిషత్‌పై దృష్టి సారించారు.

ఘనంగా 'ప్రజా పాలన' విజయోత్సవాలు

- మండలస్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



మెదక్ గురుకుల బాలికల పాఠశాలలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



మనూరులో వ్యాసరచనపోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన దృశ్యం

మెదక్ అర్బన్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): విద్యారంగాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా తొలి రోజు ఆదివారం స్థానిక గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహించిన విద్యాదినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో ప్రజాపాలన విజయోత్సవాలు ఘనంగా ప్రారంభమైనట్లు తెలిపారు. ఏడాది కాలంలో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా జిల్లాలో 562 పాఠశాలల్లో రూ. 20 కోట్లతో మౌలిక వసతులు మెరుగు పరచినట్టు తెలిపారు. అనంతరం 21 మండలాల్లో పునరుత్పాదక ఇంధన వనరులు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమొంటో, ప్రశంసా ప్రతాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, డీఈవో రాధాకిషన్, ఎంఈవో నీలకంఠం, డీఎస్‌వో రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో..

హవేళిఘణపూర్/చేగుంట/పెద్దశంకరంపేట/చిన్నశంకరంపేట/టేక్మాల్/నర్సాపూర్/మనోహరాబాద్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): హవేళిఘణపూర్ మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవాల్లో మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొని విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ని పరిశీలించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. చేగుంట మండలంలోని రెడ్డిపల్లి కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు పునరుత్పాదక శక్తివనరులపై మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎంఈవో నీరజ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పెద్దశంకరంపేటలోని కేజీబీవీలో మండల స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా, విజేతలకు ఎంఈవో వెంకటేశం బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశారు. చిన్నశంకరంపేట మండలంలో విద్యార్థులకు కేజీబీవీ పాఠశాలలో వ్యాసరచన పోటీలను నిర్వహించగా, విజేతలకు ఎంఈవో పుష్పవేణి బహుమతులను అందజేశారు. టేక్మాల్‌లోని స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు ఎంఈవో సుజాత బహుమతుల ప్రదానం చేశారు. నర్సాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈవో తారాసింగ్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ బహుమతులను అందజేశారు. మనోహరాబాద్ మండలం కూచారం గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆర్డీవో జయచంద్రారెడ్డి, కస్తూర్బా స్పెషల్ ఆఫీసర్ గౌతమి పాల్గొన్నారు. వెల్దుర్తిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలను ఎంఈవో యాదగిరి, ఎస్‌వో ఫాతిమా పర్యవేక్షించారు. విజేతలకు బహుమతులను అందజేశారు.

సంగారెడ్డి జిల్లాలో..

జిన్నారం/వట్‌పల్లి/నారాయణఖేడ్/కోహీర్/జహీరాబాద్/మునిపల్లి, డిసెంబరు 1, (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎస్టీ గురుకుల పాఠశాలలో వ్యాస రచనా పోటీలను నిర్వహించారు. ఎంఈవో కుమారస్వామి విజేతలకు బహుమతులను అందజేశారు. వట్‌పల్లి మండలం దేవునూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేసినట్టు ఎంఈవో గోవింద్‌రెడ్డి తెలిపారు. మనూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి వ్యాస రచనపోటీలను విజేతలకు ఎంఈవో ఎస్.రాజశేఖర్ పర్యవేక్షించారు. కోహీర్‌లోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఈవో జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచినవారికి ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులను అందజేశారు. జహీరాబాద్ శాంతినగర్‌లోని జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులకు ఎంఈవో బస్వరాజ్ బహుమతులను అందజేశారు. మునిపల్లిలో నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఎంఈవో భీంసింగ్, మార్కెట్‌కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి బహుమతులు అందజేశారు.

నర్సింగ్ కాలేజీ, ట్రాన్స్ క్లినిక్..

(5వ పేజీ తరువాయి)

సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో (జీఎంసీ) పారా మెడికల్ కోర్సు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ట్రాన్స్‌జెండర్ల కోసం మైత్రి క్లినిక్ పేరిట ఏర్పాటు చేసిన ట్రాన్స్ క్లినిక్‌ను ప్రారంభించనున్నారు. హైదరాబాద్ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఉదయం 11 గంటలకు వర్చువల్‌గా ఈ కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ఇందుకోసం సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అవసరమైన ఏర్పాట్లు చేశారు.

తొలిసారి ట్రాన్స్‌జెండర్స్ క్లినిక్

ట్రాన్స్‌జెండర్ల కోసం గతంలో ఎన్నడూ లేనివిధంగా తొలిసారి జిల్లాలో మైత్రి క్లినిక్ పేరిట ట్రాన్స్ క్లినిక్‌ను ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. వైద్య ఆరోగ్యశాఖ, వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారతశాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా క్లినిక్ కొనసాగనున్నది. అందరికీ సమాన గౌరవం, సమగ్ర వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో సాధారణ రోగుల మాదిరిగానే ట్రాన్స్‌జెండర్లకు కూడా ఓపీ ద్వారా వైద్య సేవలందించాలని సర్కారు నిర్ణయించి ఈ మేరకు చర్యలు చేపట్టింది. జనరల్ మెడిసిన్, డెర్మటాలజీ, సైకియాట్రిస్ట్ తదితర విభాగాల ద్వారా వైద్య సేవలందించనున్నారు. ఆరోగ్య, ఆరోగ్యేతర సేవలు, లింగ ఆధారిత సేవలు, లైంగికంగా సంక్రమించే వ్యాధులకు చికిత్స, డయాగ్నోస్టిక్ తదితర సేవలు అందించనున్నారు. ప్రతీవారం మంగళ, గురువారాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు టాన్స్‌జెండర్లకు వైద్య సేవలందించన్నుట్లు వైద్యశాఖ అధికారవర్గాలు పేర్కొన్నాయి. ట్రాన్స్‌జెండర్ల కోసం అందించే వైద్యసేవల్లో భాగంగా పదిహేను రోజుల కిందటే ఐఈసీ మెటీరియల్, బ్యానర్లు సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)కి చేరుకోగా, ప్రత్యేక ఓపీ గదిని కూడా ఈ ఆస్పత్రిలో సిద్ధం చేశారు.

రూ.43 కోట్లతో నర్సింగ్ కాలేజీ

అందోల్ నియోజకవర్గ కేంద్రంలో 60 సీట్లతో నర్సింగ్ కాలేజీ మంజూరైన విషయం తెలిసిందే. నర్సింగ్ కాలేజీలో ఫస్టియర్ తరగతులను నేడు సీఎం రేవంత్‌రెడ్డి నేడు ప్రారంభించనున్నారు. ఇప్పటికే సంగారెడ్డిలో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ కొనసాగుతుండగా, ప్రస్తుతం జోగిపేటలో ఏర్పాటుకానున్న కాలేజీతో జిల్లాలో ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ సంఖ్య రెండుకు చేరనున్నాయి. రూ.43 కోట్లతో ఏర్పాటు చేయనున్న నర్సింగ్ కాలేజీకి ఈ నెల 5వ తేదీ భవన నిర్మాణానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శంకుస్థాపన చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

కానిస్టేబుల్ కిష్టయ్యకు ఘన నివాళి



రామాయంపేటలో కిష్టయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పుల్‌కల్/నారాయణఖేడ్/రామాయంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం కోర్పోలు గ్రామంలో తెలంగాణ మలిదశ ఉద్యమంలో అమరుడైన కానిస్టేబుల్ కిష్టయ్యముదిరాజ్ 15వ వర్ధంతిని స్థానిక ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యంముదిరాజ్, సంఘం రాష్ట్ర నేత మందుమూల సపానదేవ్, రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు బి.నారాయణ, నాయకులు పాల్గొన్నారు. నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలోని ముదిరాజ్‌భవన్ ఆవరణలో ఆదివారం ముదిరాజ్‌సంఘం ఆధ్వర్యంలో పోలీసు కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామయంపేటలో సీఐ వెంకటరాజాగౌడ్ అమరుడైన పోలీసు కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే బాపూజీ పూలే జిల్లా శాఖ తరఫున పోచమ్మ అశ్విని శ్రీనివాస్,ముదిరాజ్,ప్రజాసంఘాల నాయకులు ఆయన ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు.

వాచ్‌మెన్, స్కావెంజర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వెల్దుర్తి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నైట్‌వాచ్‌మెన్, స్కావెంజర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ఎస్‌వో ఫాతిమా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 7వరకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

రాయికోడ్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించి, విద్యాభివృద్ధి కోసం ఎనలేని కృషి చేస్తుందని సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్ల అంజయ్య అన్నారు. మంగళవారం ఆయన రాయికోడ్‌లో రూ.14 లక్షలతో ప్రాథమిక పాఠశాల ప్రహరీ పనులకు భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



నాగల్‌గిద్ద: సక్రు నాయక్ తండాలో సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నాగల్‌గిద్ద, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సక్రునాయక్‌తండాలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేసంజీవరెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్‌అంజిరెడ్డి, సీఈవో రాజు, సీనియర్ కాంగ్రెస్‌నాయకులు గుండేరావుపటేల్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

- నారాయణఖేడ్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కంగ్టి మండలం రాజారాం తండాకు చెందిన పలువురు ఆదివారం నారాయణఖేడ్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. పార్టీలోచేరిన మనిరాం, పండరి, మలాఖాన్, సుభాష్, గురుదాస్, గోపాల్,సురేష్, తదితరులకు ఎమ్మెల్యేపార్టీ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. కాగా ఖేడ్ నియోజకవర్గంలో కళా ప్రదర్శనలు ఇస్తున్న తెలంగాణ సాంస్కృతికసారధి కళాకారులు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డిని స్థానిక క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

రాంరెడ్డి సేవలు చిరస్మరణీయం

మనూరు , డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుల్‌కూర్తి గ్రామానికి చెందిన బి.రాంరెడ్డి సేవలు చిరస్మరణీయమని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి, ఎల్లారెడ్డి మదన్‌మోహన్‌రావు అన్నారు. ఆదివారం ఆయన 3వ వర్ధంతిని పురస్కరించుకొని పుల్‌కూర్తిలోనిర్వహించిన వర్ధంతిసభలో వారు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రాంరెడ్డి కుమారులుజగదీశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఇప్పటి వరకు 2,10,000 మెట్రిక్ టన్నులు

చేసింది. గత నవంబరు 5వ తేదీ నుంచి ఇప్పటివరకు ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.320 కోట్లు ప్రభుత్వం జమ చేసింది. ఇంకా రూ.160 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ సీజన్‌లో అన్‌లోడింగ్ సమస్య తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. లోడింగ్, అన్‌లోడింగ్, ట్రక్‌షీట్ జనరేట్ వంటి వాటికి సాంకేతికతను వినియోగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

వారం రోజుల్లో పూర్తయ్యే అవకాశం

-హరికృష్ణ, డీఎం, సివిల్‌సప్లై మెదక్

ఈ సీజన్‌లో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని ప్రణాళిక రూపొందించుకున్నాం. ఇప్పటివరకు 2.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం. ఇంకా 50 వేల మెట్రిక్‌టన్నులు కొనుగోలు కేంద్రాలకు వస్తుందనుకుంటున్నాం. మరో వారం రోజుల్లో వందశాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యే అవకాశం ఉంది. రైతులకు సాధ్యమైనంత త్వరగా ధాన్యం డబ్బులు ఖాతాలో జమ చేస్తున్నాం. రైతులు పండించిన ధాన్యంలో అధికంగా ప్రవేటు వ్యాపారులు వ్యవసాయ క్షేత్రాల వద్దే కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. రైతులు ప్రైవేటు వ్యాపారులు, దళారులను ఆశ్రయిస్తే మోసపోయే ప్రమాదముంది.

భక్తిశ్రద్ధలతో అమావాస్య ప్రత్యేక పూజలు

కార్తీకమాసం చివరి ఆదివారం, అమావాస్యను పురస్కరించుకుని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని ప్రముఖ ఆలయాల్లో భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.



మెదక్ హనుమాన్ ఆలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణమహోత్సవంలో భక్తులు



టేక్మాల్: శ్రీవేంకటేశ్వర ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాధవానంద సరస్వతిస్వామి

మెదక్ అర్బన్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మెదక్ పట్టణంలోని కుమ్మరిగడ్డ హనుమాన్ ఆలయంలో శివపార్వతుల కల్యాణమహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అన్నప్రసాదవితరణ చేపట్టారు. శ్రీ కోదండ రామాలయంలోని భవానీ శంకరాలయంలో అర్చకులు క్రిష్ణశర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు.

- రామచంద్రాపురం, డిసెంబరు, 1(ఆంధ్రజ్యోతి): భారతీనగర్ డివిజన్ ఎల్‌ఐజీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన శివపార్వతుల కల్యాణానికి కాలనీవాసులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ స్పీకర్ భూపాల్‌రెడ్డి, భారతీనగర్ కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి తదితరులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన లక్షదీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.
- టేక్మాల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వరాలయంలో మహా రుద్ర పారాయణం ఆదివారం కనుల పండువగా జరిగింది. అనంతరం రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చనం, మహా రుద్ర పారాయణం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో వీధుల గుండా పల్లకి సేవ నిర్వహించారు. మహిళలు కుంకుమార్చన నిర్వహించారు.
- శివ్వంపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శివ్వంపేటలో వెలసిన శక్తిపీఠం బగలాముఖి ఆలయంలో కార్తీక మాసం అమావాస్య సందర్భంగా అమ్మవారికి ఆలయ వ్యవస్థాపకులు వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. యాగ మండపంలో మహామంత్ర హవనం నిర్వహించారు.
- పటాన్‌చెరు, డిసెంబరు, 1(ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ మున్సిపాలిటీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బీరంగూడ మల్లికార్జున్‌నగర్ శివాలయం ప్రాంగణంలో కార్తీక వనభోజనాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.

15 తులాల బంగారు ఆభరణాల చోరీ

రామచంద్రాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం పోలీసు స్టేషన్ పరిధిలో తాళం వేసిన ఇంట్లో 15 తులాల బంగారు ఆభరణాల చోరీ ఘటన చోటుచేసుకున్నది. ఆదివారం సీఐ జగన్నాథ్ వివరాల ప్రకారం.. జీహెచ్ఎంసీ పరిధిలోని ఎల్ఐజీ కాలనీలో నివాసముంటున్న గైక్వాడ్‌శ్రీను శనివారం రాత్రి బాంబేకాలనీలో నివాసముంటున్న తల్లిదండ్రుల వద్దకు భార్య అర్చనతో కలిసి వెళ్లాడు. ఆదివారం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి ఇంట్లోని 15తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లినట్టు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ. 12లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు సీఐ తెలిపారు.

వ్యవసాయ బోర్ల కేబుల్ వైర్లు చోరీ

తూప్రాన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ శివారు కట్టుకాలువ సమీపంలోని నల్లమత్తడి వద్ద వ్యవసాయ బోర్ల కేబుల్ వైర్లు శనివారం రాత్రి సమయంలో చోరీ జరిగినట్లు రైతులు తెలిపారు. తూప్రాన్ పట్టణానికి చెందిన మామిండ్ల దుర్గయ్య, సత్యనారాయణ, లింగం, మంద సత్తయ్య, బొల్లు వెంకటేశ్, మామిండ్ల వెంకటేశ్, జంగం విజయ్, సాయి, మామిండ్ల సత్యనారాయణలకు చెందిన వ్యవసాయ బోర్లు కట్టుకాలువ సమీపంలోని నల్లమత్తడి వద్ద ఉన్నాయి. రాత్రి సమయంలో గుర్తు తెలియని దొంగలు 26 బోరు మోటార్ల కేబుల్ వైర్లు చోరీకి గురైనట్టు వివరించారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి



పెంటాగౌడ్(ఫైల్)

మునిపల్లి, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన తాటిపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాటిపల్లికి చెందిన కోవూరి పెంటాగౌడ్(55) భార్య మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. నాటి నుంచి తీవ్రమనోవేదనకు గురై గ్రామంలోని వైన్స్ ఎదుట బజ్జీల బండీ పెట్టుకొని జీవిస్తున్నాడు. శనివారం రాత్రి గ్రామశివారులో ఓరైతు పొలం వద్ద గుర్తు తెలియని పురుగుల మందు తాగి, ఈ విషయాన్ని కొడుకుకు ఫోన్‌చేసి చెప్పాడు. సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు అనిల్ గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో బాధ పడుతున్న వ్యక్తి బలవన్మరణం



నర్సింలు మృతదేహం

చేగుంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చిటోజిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి నర్సింలు(49) ఏడాది క్రితం భుజానికి దెబ్బ తగిలడంతో నొప్పులతో బాధపడుతూ మానసికంగా ఇబ్బంది పడుతున్నారు. శనివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో దూలానికి తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

టిప్పర్ ఢీకొని బైక్ దగ్ధం.. ఒకరికి తీవ్ర గాయాలు



దగ్ధమవుతున్న ద్విచక్ర వాహనం

తూప్రాన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని టిప్పర్ ఢీకొన్న ఘటనలో వాహనదారుడికి తీవ్రగాయాలు కాగా, బైక్ దగ్ధమైంది. ఈ సంఘటన తూప్రాన్ పట్టణ పరిధిలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. తూప్రాన్ పట్టణానికి చెందిన మర్యాల దశరథ్(55) బైక్‌పై నర్సాపూర్ చౌరస్తా వద్ద నుంచి వెళ్తున్నాడు. అతడి వాహనాన్ని వెనుక వచ్చిన టిప్పర్ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో దశరథ్‌కు రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. ద్విచక్ర వాహనంలో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. బాధితుడిని 108లో ఆసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని పాడిగేదె మృతి

అల్లాదుర్గం, డిసెంబరు 1. (ఆంధ్రజ్యోతి): అల్లాదుర్గం సమీపంలోని ఐబీ గిరిజన తండా వద్ద శనివారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ఓ పాడి గేదె మృతి చెందింది. ఈ మేరకు బాధితుడు కెతావత్ శ్రీకాంత్ ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గొల్లకుంట గిరిజన తండాకు చెందిన శ్రీకాంత్ పశువులను మేత కోసం తీసుకెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఐబీ గిరిజన తండా వద్ద నారాయణఖేడ్ డిపోకు చెందిన బస్సు గేదెను ఢీ కొట్టిందన్నారు. తీవ్రంగా గాయపడిన గేదె శనివారం రాత్రి మృతి చెందినట్లు తెలిపాడు.

ఆలయాల అభివృద్ధికి రూ.2 లక్షలు విరాళం



విరాళాన్ని ఆలయకమిటీ సభ్యులకు అందజేస్తున్న చిమ్ముల కుటుంబ సభ్యులు

గుమ్మడిదల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల ఆలయాల అభివృద్ధికి చిమ్ముల కుటుంబ సభ్యులు రూ. 2 లక్షల విరాళం ఇచ్చినట్లు సీజీఆర్ ట్రస్టు చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గుమ్మడిదల మండల కేంద్రంలో ఇటీవల నూతనంగా నిర్మించిన హనుమంతుడి ఆలయంలో మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ లలితా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మహా చందనం ప్రత్యేక పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. సీజీఆర్ ట్రస్టు అధినేత చిమ్ముల గోవర్ధన్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీ మేరకు కుమారుడు మాజీ సర్పంచు చిమ్ముల నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ చిమ్ముల లలితా చేతుల మీదుగా రూ.2లక్షల విరాళాన్ని గ్రామ పెద్దల సమక్షంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డికి అందజేశారు. కమిటీ సభ్యులు దాతలను ఘనంగా సన్మానించారు.

బోధనేతర అంశాల నుంచి టీచర్లను మినహాయించాలి

- తపస్ రాష్ట్ర కార్యదర్శి దుభాషి భాస్కర్

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బోధనేతర అంశాల నుంచి టీచర్లను మినహాయించాలని టీపీయూఎస్(తపస్) రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జి దుభాషి భాస్కర్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని మాధవ సదన్‌లో తపస్ జిల్లా కార్యనిర్వాహకవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగిస్తూ బాధ్యులను చేస్తూ భయభ్రాంతులకు గురిచేయడం తగదన్నారు. ఆర్ఎస్ఎస్ విభాగ్ సహ కార్యవాహ నర్సింలు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి గొప్పదని తపస్ కార్యకర్తలు అందరికి ఆదర్శంగా ఉండాలన్నారు. ఆర్ఎస్ఎస్ విభాగ్ సహ కార్యవాహ నర్సింలు, రాష్ట్ర సహ కోశాధికారి భాస్కర్ దేశ్ మాట్లాడుతూ ఈ నెల 17 న హైదరాబాద్‌లో జరిగే ధర్మాగ్రహ దీక్షలో జిల్లా నుంచి ఎక్కువ సంఖ్యలో తరలివెళ్లాలని పిలుపునిచ్చారు.

'ప్రణాళికాబద్ధంగా కాలనీల అభివృద్ధి'

పటాన్‌చెరు, డిసెంబరు, 1(ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్ధంగా కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని పటేల్‌గూడలో యాక్సస్‌హోం కాలనీ వద్ద సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్‌చైర్మన్ నందారంనర్సింహగౌడ్, మాజీ ఎంపీపీ దేవానంద్, కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల గొంతుక ఎస్టీయూటీఎస్

జహీరాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల గొంతుకగా ఎస్టీయూటీఎస్ పనిచేస్తుందని రాష్ట్ర ఎస్టీయూటీఎస్ అధ్యక్షుడు పర్వతరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్‌లో ఎస్టీయూటీఎస్ 78వ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.